గ్రూప్-3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నవంబర్ 17, 18 తేదీల్లో పరీక్షలు నిర్వహించేందుకు 31 కేంద్రాలను గుర్తించారన్నారు. వికారాబాద్‌లో 20, తాండూరులో 11 పరీక్ష కేంద్రాలలో మొత్తం 10,196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష పత్రాలను తీసుకెళ్లేందుకు బందోబస్తు, ఎస్కార్టు ఏర్పాట్లను చూసుకోవాలని సూచించారు. సమావేశ అనంతరం జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలోని పరీక్ష పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమును అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేంద్రకుమార్, అసిస్టెంట్ రీజినల్ కోఆర్డినేటర్లు అరవిందర్‌రెడ్డి, సుధీర్, కలెక్టరేట్ ఏఓ ఫరీనాఖాతున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గురుకుల కళాశాల

మరుగుదొడ్లు లేక విద్యార్థుల నానా అవస్థలు



నిర్మాణంలో మరుగుదొడ్లు

కీసర, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కీసర మహాత్మాజ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. విద్యార్థినులకు సరైన వసతులు లేక నానా ఇవస్థలు పడుతున్నారు. కీసర పట్టణ కేంద్రంలో మేడ్చల్, హైదరాబాద్‌కు చెందిన మహిళ డిగ్రీ కళాశాలను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కాగా, మొదటి రెండు సంవత్సరాల్లో 756 మంది విద్యార్థినులు ఉన్నారు. వారికి కేవలం 30 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నవి. కాగా, మూడు సంవత్సరాల విద్యార్థినుల కోసం అదనపు భవనాలు నిర్మిస్తున్నారు. అందరికీ మరుగుదొడ్లు సరిపడక ప్రధానోపాధ్యాయురాలు చొరవ తీసుకొని పక్కనే ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలోకి విద్యార్థినులను పంపించేంది. ఆగస్టు నెలలో మళ్లీ మొదటి సంవత్సరం విద్యార్థినుల అడ్మిషన్లు జరగడంతో విద్యార్థుల సమస్య మరింత పెరిగింది. దీంతో ప్రస్తుతం 840 మంది విద్యార్థినులకు 30 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. కాగా, భవనంపై రెండు ఫ్లోర్‌లో మరో 46 మరుగుదొడ్లు నిర్మాణాలు జరగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. గత నెలలో దసరా, దీపావళి సెలవులు రావడంతో కార్మికులు సెలవులపై వెళ్లడంతో నిర్మాణం పనుల్లో ఆలస్యం జరుగుతుందన్నారు. త్వరలోనే అవి విద్యార్థినులకు అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు. విద్యార్థినుల సమస్యలు త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రధానోపాధ్యాయురాలు వనజాత 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పత్తిని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఆమనగల్లు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రం, పోలేపల్లి గేటు, ఆకుతోటపల్లి గేటు వద్ద పత్తి మిల్లుల్లో సోమవారం సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. పత్తి క్వింటాల్‌కు రూ.7,521 ప్రభుత్వం ధర ప్రకటించిందన్నారు. 8 శాతం తేమ ఉన్నప్పుడే మద్దతు ధర వస్తుందన్నారు. రైతులు తమ పత్తిని తేమ శాతం తక్కువగా ఉండేలా ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, సీపీవో లక్ష్మణ్, సీఈవో ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ సూపర్ వైజర్ రాజేశ్వరి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సంజీవ రెడ్డి, వంశీ, రామకృష్ణ, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



మాడ్గుల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మాడ్గులలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం పంచాయతీ కార్మికులు నిర్వహంచారు. సంఘం జెండాను వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. తమ సంఘం ఆధ్వర్యంలో 8గంటల పనిదినాలను కనీస వేతనం కోసం పోరాడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సయ్యద్ సరీన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, మండల నాయకులు అజీముద్దీన్, బద్యానాయక్ పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు సర్టిఫికెట్‌ను అందిస్తున్న అధికారులు

కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్

కొడంగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికేషన్ లభించిందని ప్రిన్సిపాల్ రఫియాఖానమ్ తెలిపారు. ఐఎస్‌వో 9001-క్వాలిటీ, 14001-గ్రీన్, 50001-ఎనర్జి అంశాల్లో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఇందుకు సోమవారం సంబంధిత అధికారులు శివయ్య తదితరులు అభినందించారు. గత సంవత్సరం 2023 ఫిబ్రవరిలో న్యాక్ గుర్తింపు దక్కగా ఈ సంవత్సరం ఐఎస్‌వో గుర్తింపు రావడంతో విద్యార్థుల విద్యాభివృద్ధితో ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

ఆమనగల్లు మార్కెట్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



మార్కెట్ యార్డ్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్రాలను వెంటనే ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ మార్కెట్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ అనురాధపత్యనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులతో కలిసి ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోళ్లు జరుగక వారం రోజులుగా మార్కెట్‌లో నిరీక్షిస్తున్నామని రైతులు ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులతో వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. పత్తి పంటకు రూ. 10 వేలు మద్దతు ధర ప్రకటించాలని పత్యనాయక్, అనురాధ లు డిమాండ్ చేశారు. దళారులు క్వింటాల్ పత్తి రూ. 5,500 కే కొనుగోలు చేసి రైతులను నట్టేటా ముంచుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మద్దతు ధర లభించక, కొనుగోళ్లు జరుగక, రైతుబంధు సాయం అందక, రుణమాఫీ జరుగక రైతులు గోస తీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి

తలకొండపల్లి, నవంబరు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామస్తులు పోరాటం ఉధృతం చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో గ్రామంలో నిత్యం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వెంకట్రావుపేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్సులపల్లి తండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీ తండాలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో నాలుగో రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు ఇస్లావత్ లక్యానాయక్, మెగావత్ చంద్రు నాయక్, మొకురాల నర్సింహగౌడ్, దుబ్బ నాగయ్య, బి. రామయ్య, నర్సింహులు , బాలయ్య, షరీఫ్, మాణిక్యరెడ్డి దీక్షలో కూర్చున్నారు. జేఏసీ దీక్షలకు పలు పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయుకలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు అనిల్, అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకూ క్రీడలు దోహదం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఐపీఎస్ నర్మద, ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు

మొయినాబాద్ రూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కరాటే, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలు ఆడటం వలన శరీరదారుఢ్యం పెరుగుతుందని అలాగే మరికొన్ని క్రీడలు ఆత్మరణకు ఉపయోగపడతాయని తెలంగాణ పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్, ఐపీఎస్ అధికారి నర్మద అన్నారు. మండల పరిధిలోని ఎన్టీఆర్ విద్యాసంస్థలో మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో జరిగే స్పోర్ట్‌మీట్, సంస్కృతిక పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి క్రీడాపోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటలపోటీలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడుతాయని డీన్ రామారావు, డైరెక్టర్ వెంకటేశ్వరావు అన్నారు. ఈ పోటీల్లో దాదాపు 22 పాఠశాలల నుంచి 112 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌జే.రెడ్డి, ఏవో సురేశ్, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు కూడా పాల్గొన్నారు. అధ్యాపకులు ఇతర పాఠశాలలకు చెందిన విద్యార్థులు, సిబ్బంది తదితరులున్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

దోమ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప అన్నారు. సోమవారం దోమ మండలంలోని మోత్కూర్, దాదాపూర్ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా ఇన్‌చార్జి భానుప్రకాశ్, పరిగి అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, దోమ మండల అధ్యక్షుడు అనంతయ్య, బాల్‌రాజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆలయ్, బలయ్‌లో పూర్వ విద్యార్థులు

పరిగి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిగి జెడ్పీహెచ్ఎస్ 1995-96 పదోతరగతి, 996-98 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు 29 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. పరిగి శివారులోని మీర్‌బాయ్స్ ఫాంహౌజ్‌లో సోమవారం ఆలయ్‌బలయ్ జరుపుకున్నారు. ఆట, పాటలతో పాతమిత్రులు ఆడిపాడారు. కార్యక్రమానికి మర్పల్లి కళశాల ప్రిన్సిపాల్ పండరినాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్వవిద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయమన్నారు.

మక్తలో ఘనంగా సదర్ ఉత్సవం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల

ఘట్‌కేసర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడ ప్రకృతిలోని పశుపక్షాదులతో ముడిపడి ఉన్నదని మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రాత్రి ఘట్‌కేసర్ మండల పరిధిలోని మక్త గ్రామంలో జరిగిన సదర్ వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సదర్ పండుగకు యాదవులకు ఉన్న సంబంధం వీడదీయలేనిదన్నారు. అనంతరం ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ చరిత్ర మరిచిన వీరవనిత సంగెం లక్ష్మీబాయి అన్నారు. ఆమె చరిత్రను నేటి తరానికి తెలియజేయడానికి ఘట్‌కేసర్ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. దీంతో ఎంపీ ఈటల స్పందిస్తూ విగ్రహ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రారంభం కాని కొనుగోళ్లు


ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో పేరుకున్న ధాన్యం

● పేరుకుంటున్న వడ్ల నిల్వలు

ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):వానాకాలం సీజన్ ముగిసింది. వరి కోతలు ముమ్మరమయ్యాయి. మద్దతు ధర, సన్నవడ్లకు ప్రభుత్వ బోనస్ పొందాలని రైతులు ధాన్యాన్ని మార్కెట్ యార్డ్‌కు తెస్తున్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో ధాన్యం నిల్వలు పేరుకున్నాయి. ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. గ్రామాల నుంచి వారంపది రోజులుగా వడ్లు తెచ్చి ఎండ బోస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభం కాక రైతులు యార్డు వద్దే రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. ఈ వానాకాలంలో వరిపంట ఆమనగల్లు మండలంలో 5,456 ఎకరాలు, తలకొండపల్లిలో 10,784, కడ్తాల్లో 7,785, మాడ్గులలో 1,704 చొప్పున వరి వేశారని అధికారులు పేర్కొంటున్నారు. 9.45లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

జాడలేని కొనుగోలు కేంద్రాలు

ఆమనగల్లు పరిధిలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. 11సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయించినా ఒక్కటీ ప్రారంభించలేదు. దీంతో రైతులు వడ్లను వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్ రూ.2,330 సన్నాలకు రూ.500బోనస్ ప్రకటించింది. కాగా దళారులు దొడ్డు వడ్లు రూ.1,850, సన్నాలు రూ.2,100 పెడుతున్నారు. ఇదిలా ఉంటే ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో పందుల బెడద ఎక్కువైందని, వడ్ల కుప్పలను పందులు ధ్వంసం చేస్తున్నాయని.. ధాన్యానికి రక్షణలేదని రైతులు వాపోతున్నారు.

కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి



అధికారులు వడ్ల కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి. ప్రభుత్వ మద్దతు ధర ఇవ్వాలి. ఈ వాన కాలం పంట దిగుబడి బాగానే వచ్చింది. ఐదు రోజుల క్రితం రెండు ట్రాక్టర్ల వడ్లను యార్డుకు తెచ్చాను. నేటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. రోజూ ఎండబోసి రాశి పోస్తూ వడ్ల కుప్పల వద్ద కావలి పడుకుంటున్నాం.

\- ధస్రునాయక్, రైతు, మేడిగడ్డ తండా

గన్నీ బ్యాగులు రాలేదు



కొనుగోలు కేంద్రాలకు గన్నీ బ్యాగుల సరఫరా లేక, వడ్ల సరఫరా మిల్లులను గుర్తించక కాంటా ఆలస్యం అవుతోంది. మా పరిధి మూడు కేంద్రాలకు 60వేల బ్యాగుల ఇండెంట్ పెడితే ఒక్క బస్తా రాలేదు. త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

\- గంప వెంకటేశ్, ప్యాక్స్ చైర్మన్, ఆమనగల్లు

సన్న వడ్లకు బోనస్‌తో మేలు

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడం రైతులకు మేలు చేస్తుందని మాజీ వైఎస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కందుకూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు, రైతులకిచ్చిన ప్రతి హామీని అమలుచేస్తుందన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు నమొద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు అమ్మి మద్దతు ధర, బోనస్ పొందాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు వెంకట్‌రాంరెడ్డి, పాండురంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అఫ్జల్ బేగ్, అజీజ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి

క్రైం కార్నర్

ఆటోను ఢీకొట్టిన కారు.. మహిళ మృతి

● పలువురికి గాయాలు

యాచారం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంగా నడిపి ముందున్న ఆటోను, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ మహిళ మృతిచెందగా, పలువురికి గాయాలయ్యాయి.ఈ ప్రమాదం సోమవారం యాచారంలో జరిగింది. క్షతగాత్రులను పెట్రో మొబైల్-1 పోలీసులు అంబులెన్స్‌లో మాల్‌లోని పీపుల్స్ ఆసుపత్రికి తరలించారు. విషమంగా ఓ మహిళను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. నందివనపర్తికి చెందిన కూలీలు ఆటోలో పత్తితీతకు నల్గొండ జిల్లా తీగలమల్లెపల్లి వెళ్లారు. సాయంత్రం ఆటోలో ఇంటికొస్తున్నారు. యాచారంలోని డీఎస్ఆర్ గార్డెన్ వద్ద ఆటోను వెనక నుంచి వచ్చిన కారు ఢీకొంది. అదే సమయంలో బైక్‌ను సైతం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన బుచ్చమ్మ(56) నగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. ఆటో డ్రైవర్ ఈశ్వరయ్య, కూలీలు బాలమణి, యాదమ్మ, సుగుణమ్మ, రాములమ్మ, అండాలు, పెంటమ్మ, లక్ష్మమ్మ, బైక్ నడుపుతున్న హంజ గాయపడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం


సందీప్

ఆదిభట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఆదిభట్ల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలాపూర్ మండలం మల్లాపూర్ బాలాజీనగర్ కాలనీకి చెందిన ముడావత్ సందీప్ శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో టెన్త్‌క్లాస్ చదువుతున్నాడు. దీపావళి సెలవులకు ఇంటికెళ్లాడు. ఈ నెల 3న హాస్టల్‌కు పోతున్నట్టు ఇంట్లోంచి వెళ్లి అదే రోజు సాయంత్రం పాఠశాలకు వచ్చానని తండ్రికి ఫోన్‌చేశాడు. అయితే విద్యార్థి పాఠశాలకు రాకపోవడంతో పాఠశాల నిర్వాహకులు తండ్రికి ఫోన్ చేశారు. దీంతో తండ్రి స్కూలుకొచ్చి తన కొడుకు చేసిన ఫోన్‌నంబర్ ఎవరిదని ఆరాతీయగా క్యాంటీన్‌లో పనిచేసే వ్యక్తిదని తేలింది. సందీప్ క్యాంటీన్‌కొచ్చి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు అపహరిస్తున్న ఇద్దరికి రిమాండ్


బైక్ దొంగలతో పోలీసు అధికారులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మోటార్ బైక్‌లు దొంగిలిస్తున్న ఇద్దరిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు పంపారు. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ పరిధి బ్రాహ్మణపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉండే మూల అజేందర్(24), గుగులోతు అంజి(18) స్నేహితులు. వీరిద్దరు బైక్ చోరీలు చేస్తున్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీలో వీరు(ఏపీ21 ఏజీ4211) బైక్‌పై పారిపోయేందుకు యత్నించారు. అనుమానంతో వీరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, వనస్థలిపురం, మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు మోటార్ సైకిళ్లు, రెండు హోండా యాక్టివాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు వీరిద్దరినీ రిమాండ్‌కు పంపినట్లు సీఐ వివరించారు.

ప్రయాణికురాలి బంగారు ఆభరణాల చోరీ

షాద్‌నగర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారు ఆభరణాలు, నగదును తస్కరించిన సంఘటన కొత్తూరు నుంచి షాద్‌నగర్ వస్తున్న ఆర్టీసీ బస్సులో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు మండలం తీగాపూర్‌నకు చెందిన అక్షిత పరిగిలోని బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లేందుకు కొత్తూరు వచ్చి షాద్‌నగర్ బస్సెక్కింది. టికెట్ తీసుకునేందుకు ఆధార్ కార్డు కోసం బ్యాగ్‌ను తెరిచింది. షాద్‌నగర్‌లో బస్సు దిగి బ్యాగ్‌ను చెక్‌చేసుకోగా రెండు తులాల బంగారు నల్లపూసల గొలుసు, రూ.4వేలు, సెల్‌ఫోన్ పోయినట్టు గుర్తించింది పోలీసులకు ఫిర్యాదు చేసింది.

28 గొర్రెల అపహరణ

మాడ్గుల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):అప్పారెడ్డిపల్లిలో గొర్లషెడ్డు నుంచి ఆదివారం రాత్రి దొంగలు 28గొర్లను ఎత్తుకపోయారని సీఐ జగదీష్ సోమవారం తెలిపారు. అప్పారెడ్డి, దొడ్లపహాడ్‌ల మధ్య మాడ్గులకు చెందిన మంచన కరుణాకర్ షెడ్‌వేసి దానిలో గొర్రెలను ఉంచుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు జీవాలను ఎత్తుకపోయారని కరుణాకర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సైబర్ క్రైమ్, పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

కందుకూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్, పోక్సో చట్టంపై యువతకు అవగాహన కలిగి ఉండాలని సీఐ సీతారామ్ తెలిపారు. సోమవారం కొత్తగూడ జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. ఎస్సై సైదులు, ప్రిన్సిపాల్ మంగరాజు, అధ్యాపకులు సైదులు, పర్వతాలు, జ్యోతి, రామిరెడ్డి, శ్రీనివాస్, రాధ, ప్రమీళ, యాదయ్య, పెద్దయ్య, రాఘవులు, సుధ పాల్గొన్నారు.

మూసీ వంతెన నిర్మాణ పనులు పునః ప్రారంభం

మొయినాబాద్ రూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గతంలో కురిసిన వర్షాలతో చిన్నమంగళారం-గోపులారం మధ్య నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి పనులు నిలిచిపోయాయి. వర్షాలు తగ్గిపోవడంతో బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. మొయినాబాద్-శంకర్‌పల్లి మండల ప్రజలకు ఈ బ్రిడ్జి ఎంతో ముఖ్యం. ప్రభుత్వం మూసీవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరు చేసింది. పనులు పిల్లర్ల వరకు చేరగా వర్షాలు పడడంతో పనులు నిలిచాయి. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో అధికారులు బ్రిడ్జి పనులను పునఃప్రారంభించారు. అధికారులకు, ఎమ్మెల్యే యాదయ్యకు,కాంట్రాక్టర్‌కు చిన్నమంగళారం, గోపులారం మాజీ సర్పంచ్‌లు సుకన్య హరిశంకర్‌గౌడ్, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మల్లేష్, విష్ణుగౌడ్, రాజమల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైఎస్ చైర్మన్ జి.విజయేందర్‌రెడ్డి కోరారు. సోమవారం కందుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. రైతులు వడ్లను ఎండపెట్టి తూకానికి తేవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్, సొసైటీ డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, నర్సింహ, పర్వతాలు, అంజమ్మ, టి.జగదీశ్వర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, పాండురంగారెడ్డి, ఏవో కృష్ణకుమార్, ఏఈవో రాజు, కార్యదర్శి నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది రాకేష్, మహేష్, పర్వతాలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు సంఘటితం కావాలి

షాబాద్,నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులంతా సంఘటితమై సమస్యలను పరిష్కరించుకుందామని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్‌లోని రైతువేదికలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏఈ కోటేశ్వర్‌రావును కలిసి సమస్యలపై వివరించారు. వారు మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి సంఘం ఎప్పుడు కృషి చేస్తోందన్నారు.

కుల గణనతో సామాజిక న్యాయం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నో కులాలు రాజ్యాధికారానికి నోచుకోలేదని, కుల గణనతో సామాజిక న్యాయం జరిగి బడుగులు రాజ్యాధికారంలో భాగస్వాములవుతారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.పాపిరెడ్డిగూడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బీసీ కుల గణనపై అన్ని పార్టీలను ఒప్పించారని గుర్తుచేశారు. ఈ నెల 6నుంచి కుల గణన మొదలవుతుందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 5న రాహుల్‌గాంధీ హైదరాబాద్ కు రానున్నారని, ఆయనకు కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నమని తెలిపారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుల గణనపై డెడికేటెడ్ కమిటీ వేయాలన్న హైకోర్టు సూచనను ముఖ్యమంత్రి వెంటనే అమలు చేశారని చెప్పారు. దేశంలో మార్పు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీలు టి.విశాలశ్రవణ్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శివయ్య, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

షాద్‌నగర్: పత్తి కొనుగోలు విషయంలో ఇబ్బందిపెట్టొద్దని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అధికవర్షాలతో పత్తి దిగుబడి తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, బాలరాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.


పత్తి ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే శంకర్

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభం

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ మున్సిపాలిటీ 9వ వార్డులో ఎమ్మెల్యే శంకర్ యూజీడీ పనులను ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులడిగితే నిర్బంధమా?


షాద్‌నగర్ అర్బన్: అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

షాద్‌నగర్ అర్బన్/షాద్‌నగర్/కొత్తూరు/తలకొండపల్లి/ఆమనగల్లు/చౌదరిగూడ/కేశంపేట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు చేసిన పనుల బిల్లులు ఇవ్వాలని అడిగితే నిర్బంధించడం, అరెస్టులు చేయడం అన్యాయమని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపిచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి షాద్‌నగర్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం తరువాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. బిల్లులు రాక తాము అప్పులపాలయ్యామన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులివ్వాలన్నారు.


తలకొండపల్లి: మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

అరెస్టయిన వారిలో పల్లె శ్రీనివాస్‌రెడ్డి,శ్రీశైలంయాదవ్, సాయిప్రసాద్‌యాదవ్, శ్రీనివాస్, కె.నర్సింహులు, పి.లక్ష్మణ్‌నాయక్, రాములునాయక్, శివజ్యోతి, మాధవిరంగయ్య ఉన్నారు. శాంతియుత నిరస నకు హైదరాబాద్ బయల్దేరిన మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం అన్యాయం అని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాదిగా ప్రభుత్వం బిల్లులు ఇవ్వక అప్పులతో మాజీ సర్పంచ్‌ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కొత్తూరు మండల మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు వడ్డె బాలయ్య మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్‌లు తమ సమస్యలపై గళమెత్తితే అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అన్నారు. బిల్లులు ఇవ్వకపోగా అరెస్ట్ చేయడం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెల్దాలలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. తలకొండపల్లి మండలంలో మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బక్కి కుమార్, లలితజ్యోతయ్య, హైమవతి, రమేశ్, వెంకటయ్య ఉన్నారు. బకాయి బిల్లులను చెల్లించాలంటున్న మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం దుర్మార్గమని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్‌లపై ప్రభుత్వ కక్షసాధింపు సరికాదన్నారు. లక్ష్మీనర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి కృషిచేసిన మాజీ సర్పంచ్‌లు బిల్లులు అడిగితే అరెస్ట్ చేయడం ఏం న్యాయం అని ప్రశ్నించారు. ప్రభుత్వం బిల్లులను విడుదల చేయకుంటే ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని ఎల్ఎన్ఆర్ పేర్కొన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పోలీసులు అరెస్టు చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ అప్పులు చేసి గ్రామాల్లో పలుచేస్తే బిల్లులను ఇవ్వరా? అని అవేదన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో గూడ వెంకటస్వామి, అక్రం, శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, అంజనేయులు, శేఖర్, అంజయ్య ఉన్నారు.చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న కొత్తపేట, ఇప్పలపల్లి మాజీ సర్పంచ్‌లు నవీన్‌కుమార్, తోట ఆంజనేయులను కేశంపేట పోలీసులు అరెస్ట్ చేశారు. అల్వాల మాజీ సర్పంచ్ భర్త శ్రీనివాసులను అరెస్ట్ చేశారు.


కొత్తూరు: పోలీసుల అదుపులో వడ్డె బాలయ్య


ఆమనగల్లు: పోలీసుల అదుపులో లక్ష్మినర్సింహారెడ్డి


తలకొండపల్లి పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు


చౌదరిగూడలో అరెస్టయిన నాయకులు

ఆలయ ప్రారంభోత్సవ పూజల్లో బీజేపీ నాయకులు

కేశంపేట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిగూడలో సోమవారం రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శివలింగం, నందివిగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, మండలాధ్యక్షుడు రాఘురాములుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రవణ్‌రెడ్డి, సుందరయ్య, నరేందర్, శ్రీను పాల్గొన్నారు.


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఆలయాల అభివృద్ధికి కృషి

షాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం హైతాబాద్‌లో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించే మహాకాళి, బీరప్ప, మల్లన్నస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని గ్రామస్తులు సోమవారం ఆహ్వానాన్ని అందజేశారు. నూతన ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.లక్ష విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ మెంబర్ చాంద్‌పాషా మాజీ డైరెక్టర్ యాదయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.


ఉత్సవాలకు రావాలని అవినాష్ రెడ్డిని ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

యాసంగికి రెడీ!

(3వ పేజీ తరవాయి)

ఆధారంగా జిల్లాలో యాసంగిలో 1,23,932ఎకరాల్లో రకాల పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు. ఆయా పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేలా అధికారులు ప్రణాళికను రూపొందించారు.

అత్యధికంగా వరి సాగు

జిల్లాలో అత్యధికంగా వరి, అత్యల్పంగా ఆముదం పంట సాగుచేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరి పంట 1,00,256 ఎకరాలు, ఆముదం సాగు 66ఎకరాల్లో వేస్తారని అధికారులు ప్రణాళిక రూపొందించారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

యాసంగిలో సాగయ్యే పంటలకు విత్తనాలు, ఎరువులు ఏ మేరకు అవసరమో అంచనాలు వేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎన్ని క్వింటాళ్ల విత్తనాలు అవసరమో జిల్లాలోని డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అవసరమైన మేరకు ఎరువులు సైతం అందుబాటులో ఉంచేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం చేశాం



జిల్లా వ్యాప్తంగా యాసంగిలో పంటల సాగు ప్రణాళికను రూపొందించాం. ఈ సారి యాసంగిలో జిల్లాలో 1,23,932 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనాలు రూపొందించాం. వివిధ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలి.

\- నర్సింహారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

కావాల్సిన విత్తనాలు

పంట	పరిమాణం (క్వింటాళ్లలో)
వరి	25,064
జొన్న	44.52
మొక్కజొన్న	561.6
శనగ	840.3
వేరు శనగ	4,038.6
కుసుమ	106.64
పొద్దు తిరుగుడు	7.29
ఆముదం	1.65
మొత్తం	30,664.6

రసాయనిక ఎరువులు (టన్నుల్లో)

రకం	ప్రణాళిక	నిల్వలు
యూరియా	18,000	5,426.40
డీఏపీ	6,000	714.95
ఎస్ఎస్‌పీ	1,500	314.95
ఎంవోపీ	2,500	389.1
కాంప్లెక్స్	16,000	3,788.71
మొత్తం	44,000	10,634.12

శివాలయంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహించిన పద్మారెడ్డి తదితరులు

మాడ్గుల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పెద్ద మాడ్గుల సమీపంలోని స్వయంభూ శివాలయంలో సోమవారం అభ్యుదయ ఫౌండేషన్ చైర్మన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ సూదిని పద్మారెడ్డి పూజలు నిర్వహించారు. కార్తీక మాస తొలిరోజు శివాలయంలో పూజలు చేశామని, ప్రజలందరికీ సుఖ సంతోషాలు కలగాలని, ప్రజలపై శివుడి అనుగ్రహం ఉండాలని వేడుకున్నామని తెలిపారు. పూజల్లో తన సోదరుడు మనోహర్‌రెడ్డి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాండుగౌడ్, శరత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కాట్ల యాదయ్యగౌడ్, విజయ్ పాల్గొన్నారు.

సమస్యలపై గొంతెత్తితే అక్రమ అరెస్టులా?

(3వ పేజీ తరువాయి)


రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అరెస్ట్ చేసి నిర్బంధించడాన్ని ఆమె ఖండించారు. సమస్యలను విన్నవించుకోకుండా అడ్డుకోవడం, నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సబితారెడ్డి డిమాండ్ చేశారు. కడ్తాల మండలం అనాథ ఆడబిడ్డల పెళ్లిళ్లకు మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ రూ.లక్షతో పాటు తులం బంగారు ట్రస్ట్ ద్వారా అందిస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. రేవంత్‌రెడ్డి గత ఎన్నికల ప్రచారంలో ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.1,00,116, తులం బంగారం ఇస్తామని చెప్పి మరిచిపోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు, దాతృత్వం వ్యక్తి ప్రతిష్ఠకు దోహదపడతాయన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం చైతన్యవంతమైన ప్రాంతమన్నారు. తన కొడుకు రాధాకృష్ణ స్మారకార్థం దశరథ్‌నాయక్ ట్రస్ట్ స్థాపించి చేపడుతున్న సేవలు గొప్పవన్నారు. ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ రాధాకృష్ణ ట్రస్ట్ సేవలకు తనవంతు తోడ్పాటునందిస్తానన్నారు. ఇటీవల మృతిచెందిన కడ్తాలకు చెందిన మున్వర్‌పాషా కుటుంబాన్ని ఆదుకుంటామని దశరథ్, వెంకటేశ్‌లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనిసాయిచంద్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్‌చైర్మన్ యు.వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ లు అనురాధపత్యానాయక్, ద్యావ విజితారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, కల్వకుర్తి కాటన్ మిల్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్, బీఆర్ఎస్ జిల్లా,మండల నాయకులు కంబాల పరమేశ్, లచ్చిరామ్‌నాయక్, జోగు వీరయ్య, పొనుగోటి అర్జున్‌రావు, లాయక్‌అలీ, లాలయ్యగౌడ్, రామకృష్ణ, శ్రీనునాయక్, హరిచంద్, అంజి, శంకర్, బి.గోపాల్, రమేశ్, చంద్రమౌళి, సేవ్య, వెంకటయ్య, లోకేశ్, మహేశ్, రంగయ్య, బిక్యా పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సర్వే పక్కాగా చేపట్టాలి

ఆమనగల్లు/యాచారం/చేవెళ్ల: సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఆమనగల్లు తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, ఎంపీడీవో కుసుమమాధురి, ఎంఈవో పాండు సూచించారు. అలసత్వానికి తావివ్వకుండా నిబంధనల మేరకు సర్వే రికార్డు చేయాలన్నారు. ఆమనగల్లు రైతు వేదికలో సోమవారం సర్వేపై టీచర్లకు అవగాహన కల్పించారు. యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో కుల సర్వేపై ఎన్యుమరేటర్లకు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రతీ ఇంటికి కనీసం 15నిమిషాల టైం తీసుకొని సర్వే చేయాలన్నారు. గ్రామస్తులే పంచాయతీ ఆఫీసుకు వచ్చి వివరాలు చెప్పాలని కోరొద్దని, సిబ్బందే ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, ఎంఈవో పాండురంగారెడ్డి ఉన్నారు. సర్వేను విజయవంతంగా నిర్వర్తించాలని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు తెలిపారు. మండల పరిషత్‌లో సర్వే కోసం ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు, అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కుల గణన విధులు అందరికీ కేటాయించాలి

ఆదిభట్ల: కుల గణన విధులకు ప్రైమరీ పాఠశాలల టీచర్లనే కేటాయించడం వివక్షేనని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు పరమేష్ ఓ ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులందరికీ విధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు.

స్త్రీ నిధి ఇన్సెంటివ్ చెల్లించాలి

మాడ్గుల: మాడ్గుల మండలంలో పనిచేస్తున్న వీఓఏలకు జీవో ప్రకారం గ్రామసంఘం నుంచి రావలసిన రూ.3వేల ఇన్సెంటివ్ ఇవ్వలేదని, వాటిని చెల్లించాలని మహిళా సంఘం సీసీ శ్రీశైలానికి వీఓఏలు సోమవారం వినతిపత్రం అందచేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

షాద్‌నగర్ అర్బన్: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయానికి ఎంఎన్ఆర్ సేవా సంస్థల అధినేత మందడి నరేందర్‌రెడ్డి లక్ష, నూట పదహారు రూపాయలను విరాళంగా ఇచ్చారు. నరేందర్‌రెడ్డిని ఆలయ నిర్మాణ కమిటీ కన్వీనర్లు వెంకటేష్‌గుప్తా, వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కో-కన్వీనర్‌గా మహేష్

షాద్‌నగర్ అర్బన్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కో-కన్వీనర్‌గా షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లికి చెందిన మాల మహేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నియామకపత్రాన్ని అందుకున్నారు. ఎస్సీలను విభజించే వర్గీకరణ అమలు కాకుండా తన వంతు పోరాటం చేస్తానని ఈ సందర్భంగా మహేష్ పేర్కొన్నారు.

హిమాయత్‌నగర్‌లో సదర్ వేడుకలు

మొయినాబాద్ రూరల్: మొయినాబాద్ హిమాయత్‌నగర్‌లో సదర్ సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి డప్పు చప్పుళ్లు, యువకుల కేరింతల మధ్య దున్నరాజుల విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా సభ్యుడు ముదిగొండ రవి యాదవ్ పాల్గొని మాట్లాడారు. సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకుడు దోమ దిలీప్‌కుమార్ అతిథులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

యాచారం: పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు. ఆదివారం రాత్రి కుర్మిద్దలో యాదవులు నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవాలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు.